
సాక్షి గుంటూరు

ఆదివారం । 8 । జూన్ । 2025



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 511.60 అడుగుల వద్ద ఉంది. ఇది 134.4032 టీఎంసీలకు సమానం.

నేడు కృష్ణవేణి విగ్రహ ప్రతిష్ట



రెంటచింతల: సత్రశాల వద్ద శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం కృష్ణవేణి అమ్మవారి విగ్రహం ప్రతిష్టించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానం, బంగారు తాపడం పనులకు విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి, బంగారు తాపడం పనులకు విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ. 2.52 లక్షల విరాళాన్ని అందజేశారు. నగరంలోని రామచంద్రనగర్‌కు చెందిన బట్టు నాగేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. నాగేశ్వరరావు పేరిట రూ. 1,51,116 విరాళాన్ని, జిష్ణురావు పేరిట బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

నేడు ఏపీసీబీఈఏ రాష్ట్ర మహాసభలు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీసీబీఈఏ) పదో రాష్ట్ర మహాసభలు మచిలీపట్నంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోపీనాథ్ శనివారం తెలిపారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని రెవెన్యూ కల్యాణ మండపంలో మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. మహాసభలకు 13 జిల్లాల డీసీసీబీ ఉద్యోగులు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశానికి జిల్లాలోని సహకార బ్యాంకుల ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వైభవంగా శోభాయాత్ర



విజయవాడ కల్చరల్: వేంకటేశ్వరుడి శోభాయాత్ర వైభవంగా జరిగింది. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలోని పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం దేవాలయంలో నిర్వహించిన వైదిక కార్యక్రమాలు భక్తిగా సాగాయి. ఉదయం వేంకటేశ్వర స్వామికి దేవాలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పూలతో అలంకరించిన పల్లకీపై పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామిని దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు. దేవాలయన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాడు



మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నెరవేర్చే క్రమంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే విప్లవాత్మకమైన సచివాలయ వ్యవస్థకు నాంది పలికారు. ప్రజలకు తమ సమీపంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం, సర్టిఫికెట్లు, ఆరోగ్య, ఇతర సేవలు అందేలా వ్యవస్థను రూపొందించారు. ఆ సచివాలయాల్లో వేలమందికి ప్రభుత్వ ఉద్యోగాలు సైతం కల్పించారు. సచివాలయాలకు అనుబంధంగా ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా చేసింది. వలంటీర్ల ద్వారా రాష్ట్ర ప్రజలు ఇంటివద్దనే ప్రభుత్వ సేవలు పొందారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతను దేశం వేనోళ్లా పొగిడింది.

నేడు




దేశవ్యాప్తంగా పేరొందిన సచివాలయాలను ఒక క్రమపద్ధతిలో నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తుంది. ఫలితం నాడు ప్రజలు, ఉద్యోగులతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. నాడు అన్ని ప్రభుత్వ సేవలు తమ ఇంటిదగ్గర్లోని సచివాలయాల్లో అందుకున్న ప్రజలు నేడు మీసేవ, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు నెట్ సెంటర్‌ల చుట్టూ తిరుగుతూ ఆపసోపలు పడుతున్నారు. మమ్మల్ని గెలిపిస్తే గౌరవ వేతనం రెట్టింపు చేస్తామని వలంటీర్లను నమ్మబలికిన చంద్రబాబు నేడు అధికారంలోకి వచ్చాక హామీకి మంగళం పాడి.. వారి ఉద్యోగాలు ఊడబెరికి, రోడ్డున నిలబెట్టారు.

సేవలకు మంగళం

ఏడాదిగా గ్రామ స్వరాజ్యాన్ని నీరుగార్చిన కూటమి

- నాడు ఇంటివద్దకే అన్ని సేవలు
- నేడు సేవలు అందక ప్రజలు ఇక్కట్లు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- వివిధ రకాల సర్వేల పేరిట సిబ్బందిపై అదనపు భారం
- ప్రభావం కోల్పోయిన గ్రామ స్వరాజ్యం
- వలంటీర్లను నిలువునా మోసం చేసిన చంద్రబాబు





నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): సూర్యోదయానికంటే ముందే వలంటీర్లు ఇంటి తలుపుతట్టి నెలలో మొదటి తేదీన పింఛన్ ఇచ్చేవారు. 50 ఇళ్లకో వలంటీరు ద్వారా ప్రజలకు సేవలు అందేవి. వారిని కూటమి పార్టీలు సంఘ విద్రోహశక్తుల్లా అభివర్ణించాయి. అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకు మంగళం పాడేశాయి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా ఉచితంగా ఇంటి సమీపంలోనే అందేవి. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పింది. నేడు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అవి కళతప్పాయి. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగే దుస్థితి ఏర్పడింది. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఐదేళ్లు జిల్లావ్యాప్తంగా 51,66,759 సేవలు అందాయి. నేడు ఈ సేవలన్నింటికీ మంగళం పాడారనే చెప్పుకోవాలి.

కళ కోల్పోయిన సచివాలయాలు

గుంటూరు జిల్లాలో మొత్తం 568 సచివాయాలున్నాయి. ఇందులో గ్రామ సచివాలయాలు 232, వార్డు సచివాలయాలు 236 ఉన్నాయి. వీటిలో మొత్తం 5,563 మంది ఉద్యోగులు ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించేవారు. సచివాలయం మెట్లు ఎక్కిన వారికి అవసరమైన పనిని నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ఇచ్చేవారు. సేవలన్నీ ఉచితంగా అందేవి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో సచివాలయాలు కళకళలాడుతూ ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి ప్రాధాన్యతను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. మీ సేవ కేంద్రాలకు, నెట్ పాయింట్లకు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి కల్పించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో దాదాపుగా ప్రతి గ్రామంలోనూ సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించింది. ప్రస్తుతం సచివాలయాలు కళ తప్పాయి.

సచివాలయానికి టార్గెట్లు

రాష్ట్ర ప్రభుత్వం పీ4 సర్వే, ఈకేవైసీ, ఇంటింటి సర్వే, స్ట్రీట్ వెండర్స్ సర్వేలతో సచివాలయ ఉద్యోగులను వేధిస్తోంది. వీటన్నిటితో పాటుగా యోగాంధ్ర సర్వే పేరిట సచివాలయానికి 1500 మందిని ఎన్‌రోల్ చేయాలని టార్గెట్లు ఇచ్చింది. సచివాలయ సెక్రటరీలు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి వారి ఫోన్లకు మేసేజ్ పంపించి.. ఓటీపీ చెప్పించుకుని వారిని భాగస్వాములను చేయాలని ఆదేశించింది. దీంతో సెక్రటరీలు ప్రజల వద్దకు వెళ్లి ఓటీపీలు చెప్పాలని కోరితే వారు ఓటీపీ చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. అటు ప్రజలకు చెప్పుకోలేక.. ఇటు ప్రభుత్వానికి వివరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పొమ్మనలేక పొగ



కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు పొమ్మనలేక పొగపెడుతుంది. సచివాలయ సిబ్బందిలో అధికశాతం మంది ఉన్నత విద్యనభ్యసించినవారే. ఎంటెక్, ఎమ్మెస్సీ వంటి కోర్సులు చేసిన వారున్నారు. కొందరు పీహెచ్‌డీలు కూడా చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యం సాధించాలని సచివాలయ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఒకే నోటిఫికేషన్‌తో లక్షన్నరకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగం, జీవితానికి భద్రత ఉంటుందని భావించిన వీరంతా లక్షల మందితో పోటీపడి సచివాలయ ఉద్యోగాలు సాధించారు. ప్రొబేషన్ తరువాత రెగ్యులర్ ఉద్యోగులయ్యారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేశారు. ఐదేళ్లు గడిచిపోయాయి. నేడు కూటమి ప్రభుత్వం సర్వేల పేరుతో వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది.

వలంటీర్ల ద్వారా అద్భుత సేవలు



దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

గత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఇంటి ముగింటకే అన్ని సేవలూ అందుబాటులోకి తీసుకువచ్చింది. రూ.5వేల గౌరవవేతనంతో రౌండ్ ది క్లాక్ విధులు నిర్వర్తించిన వలంటీర్లకు ప్రజలు జేజేలు కొట్టారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాలను అర్హుల చేతికి అందించేవారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి తలుపుకొట్టి అవ్వాతాతలకు పింఛన్లు అందజేశారు. ఎవరైనా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఉంటే దూరమైనా సరే.. అక్కడికి వెళ్లి మరీ పింఛను నగదు చేతిలో పెట్టేవారు.

■ కరోనా సమయంలో వారు చూపిన సేవాగుణం అమోఘం.. మహమ్మారి సోకి ఇంటివారే దూరం పెట్టిన పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి మరీ ఆహారం, నిత్యావసరాలు, మందులు తదితరాలు అందించి, ఎందరికో అండగా నిలిచారు. సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తు చేయించేవారు. జిల్లా వ్యాప్తంగా 10,089 మంది వలంటీర్లు నిరంతరం ప్రజా సేవలో ఉండేవారు. ఎన్నికల ముందు వేతనాలు పెంచి ఈ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది.

సర్వేల పేరిట వేధిస్తున్నారు



సర్వేల పేరిట రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను గత 10 నెలల నుంచి తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తుంది. సెలవు రోజుల్లో సైతం విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు చేసిన విధులన్నింటినీ సెక్రటరీలకు అప్పగించి పెద్ద వలంటీర్లను చేసి అవమానిస్తున్నారు. ప్రస్తుతం యోగాంధ్ర పేరుతో ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని ఆదేశించింది. ప్రజలు ఓటీపీలు చెప్పేందుకు వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల సమస్యలను గుర్తెరిగి సర్వే విధులను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వాలి.

– షేక్ అబ్దుల్ రజాక్, గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసింది



అధికారంలోకి వస్తే గౌరవ వేతనం రూ.10వేలు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు..మా ఉద్యోగాలు తొలగించి మమ్మల్ని మోసం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వలంటీర్లను విధుల్లోకి తీసుకునే అంశంపై పునరాలోచించాలి. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి, సేవలు అందించిన మాకు తగిన న్యాయం చేయాలి.

– దోలా స్వప్న, వలంటీర్





బక్రీద్ పర్వదినం సందర్భంగా గుంటూరు నగరంపాలెంలోని ఈద్గా వద్ద శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మతపెద్దలు ఉద్బోధించారు. వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

బక్రీద్ సందేశం ఇస్తున్న ముఫ్తీ రహంతుల్లా

ఎనిమిదేళ్ల కష్టమే కన్నప్ప

- హీరో విష్ణు పది కాలాలపాటు కన్నప్పగా నిలిచిపోతాడు
- ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు
- నటుడు మోహన్‌బాబు
- గుంటూరులో కన్నప్ప ప్రీ రిలీజ్ ఈవెంట్



వేదికపై సినీ నటులు మంచు మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా, బ్రహ్మానందం, బాలాజీ, రఘుబాబు, సప్తగిరి, తాడిశెట్టి బ్రదర్స్

నగరంపాలెం: ఎనిమిదేళ్ల కష్టమే కన్నప్ప చిత్రమని సినీనటుడు మంచు మోహన్‌బాబు అన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం సాయంత్రం కన్నప్ప చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరగ్గా, ఏసీ కళాశాల నుంచి విజ్ఞాన మందిరం వరకు ర్యాలీ కొనసాగింది. నటుడు మోహన్‌బాబు మాట్లాడుతూ కన్నప్పను పరమేశ్వరుడు ఆశీర్వదించారని అన్నారు. ఈ చిత్రంలో నటుడు మంచు విష్ణు రెండు పాత్రలు పోషించారని, చాలా అద్భుతంగా నటించాడని చెప్పారు. మళయాళం, తమిళం, హిందీ, తెలుగు భాషల్లోని అగ్రనటులు పలు పాత్రల్లో పోషించారని, ఆయా పాత్రలకు వారిని అడిగిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. అగ్రనటుడు ప్రభాస్, నేను బావ అని ఆప్యాయంగా పిలుచుకుంటామని, పాత్ర గురించి చెప్పగానే అందులో నటించేందుకు అంగీకరించాడని అన్నారు. వైజాగ్, విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలలో ఈవెంట్ చేద్దామని భావించామని, అయితే గుంటూరులో చేయడం ఆనందంగా ఉందన్నారు. చాన్నాళ్ల తర్వాత గుంటూరు వచ్చానని పేర్కొన్నారు. 1991 నుంచి తాడిశెట్టి వెంకట్రావుతో పరిచయం ఉందన్నారు.

కన్నప్ప నాలో మార్పు తీసుకొచ్చింది: విష్ణు

నటుడు మంచు విష్ణు మాట్లాడుతూ నా దేవుడు నాన్న అని, ఆయన లేకపోతే నేను లేనన్నారు. నటుడు ప్రభాస్‌కు ఎంతగానో రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కన్నప్ప చిత్ర ప్రయాణం నాలో ఎంతగానో మార్పు తీసుకువచ్చిందన్నారు. హాస్యనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ మోహన్‌బాబు తనపై ఉన్న వాత్సల్యంతో ఈ చిత్రంలో పాత్ర ఇచ్చారన్నారు. పది కాలలపాటు కన్నప్పగా మంచు విష్ణు నిలిచిపోతాడని పేర్కొన్నారు. గుంటూరు బాగా పరిచయమైన స్థలమని, ఇక్కడ చదువుకున్నానని తెలిపారు. గతంలో ఈ ఊరు వచ్చి లారీలకు రంగులేశానని గుర్తుచేసుకున్నారు. దర్శకుడు ముకేష్ కుమార్‌సింగ్, నృత్యదర్శకుడు ప్రభుదేవా, నటులు రఘుబాబు, శివబాలాజీ, సప్తగిరి, ముకేష్‌రుషి చిత్ర బృందం పాల్గొన్నారు. అనంతరం మోహన్‌బాబును వెండి కిరీటంతో సత్కరించగా, తాడిశెట్టి సోదరులను మోహన్‌బాబు సత్కరించారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 2,000
మోడల్ ధర రూ. 1,500

క్లుప్తంగా

'ప్రైమరీ' హెచ్‌ఎంలుగా 178 మందికి ఉద్యోగోన్నతి

గుంటూరులో కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల కేటాయింపు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా 78 మంది ఎస్జీటీలు ఉద్యోగోన్నతిపై నియామకం పొందారు. శనివారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని గుంటూరు ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఉద్యోగోన్నతులు కల్పించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు సీవీ రేణుక, చంద్రకళ పర్యవేక్షణలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లోని హెచ్‌ఎంలను ఉద్యోగోన్నతిపై నియమించేందుకు దాదాపు 1,400 మంది ఉపాధ్యాయులను పిలిచారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాదిగా తరలివచ్చినప్పటికీ, ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లేందుకు విముఖత వ్యక్తం చేశారు. ఎట్టకేలకు 78 పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గుంటూరు డీవైఈఓ యేసురత్నం, ఎంఈఓలు ఎ.తిరుమలేష్, సీనియర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రిమాండ్ నిందితుడు పరారీ

పట్నంబజారు: రిమాండ్ నిందితుడు వైద్య పరీక్షల నిమిత్తం వచ్చి పరారైన సంఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చేబ్రోలు గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా హత్య కేసులో నిందితుడుగా గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నాడు. అయితే శనివారం ఆరోగ్యం బాగోకపోవటంతో ఎస్కార్ట్ పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొని వచ్చారు. చికిత్స పొందుతున్నట్లు నటించి ఎస్కార్ట్ పోలీసుల కళ్లుగప్పి నాగుల్ మీరా అక్కడినుంచి పరారయ్యాడు. ఎస్కార్ట్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీవిత యుద్ధ విజేత

SUNDAY SPECIAL

- ఎయిర్‌ఫోర్స్‌లో క్రీడాకారుడిగా ఎదిగారు – బయటకొచ్చాక పౌల్ట్రీతో వ్యాపారసామ్రాజ్యం
- అకాడమీతో క్రీడాకారుల తయారీ
- ఇప్పుడు సైనిక్‌స్కూళ్ల ఏర్పాటుకు తోడ్పాటు
- క్రీడాఅకాడమీ పునరుద్ధరణకు సన్నాహం
- సీబీఆర్ ప్రసాద్ అలియాస్ చలసాని బలరామయ్య జీవనయాత్రం స్ఫూర్తిదాయకం


తెనాలి: అయిదో తరగతిలో పరుగుపందెం.. ఆరో తరగతి ప్రవేశపరీక్ష... రెండింటిలోనూ ఆ బాలుడు ఓడిపోయాడు. ఓటమి బాధను మించి గెలవాలన్న రోషం పెరిగింది అతడిలో...! బాగా చదువుతూ ఎయిర్‌ఫోర్స్‌లో చేరాడు. బయటకొచ్చాక పౌల్ట్రీలోకి వచ్చాడు. అతిపెద్ద పౌల్ట్రీ సామ్రాజ్యాన్ని నిర్మించాడు. క్రీడా అకాడమీతో క్రీడాకారులను తీర్చిదిద్దాడు. క్రీడారాజకీయాలతో సామాజికసేవకు అంకితమయ్యాడు. సైనికుల తయారీలో తోడ్పాటుకు సిద్ధపడ్డాడు. సైనిక్‌స్కూలుకు రూ.20 కోట్లకు పైగా విరాళమిచ్చాడు. తెలుగు రాష్ట్రాల్లో మరో మూడు సైనిక్ స్కూళ్లకు ప్రణాళికను రచించారు. మరోవైపు అకాడమీనీ పునరుద్ధరించనున్నారు. సంపాదనలో తొంభై శాతం సమాజపరం చేసిన ఆ మాజీ సైనికుడు సీబీఆర్ ప్రసాద్ అలియాస్ చలసాని బలరామయ్య జీవనయాత్ర స్ఫూర్తిదాయకం. అఖిల భారత సేవాపరిషత్ సభ్యులను కలిసేందుకని తెనాలి వచ్చిన బలరామయ్య 'సాక్షి'తో పంచుకున్న ఆ విశేషాలు.

రక్షణ శాఖకు రూ.1.08కోట్ల విరాళం

తనకు ఏమీ లేని రోజుల్లో 108 నెలలు ఉద్యోగమిచ్చి పోషించి, క్రీడారంగంలో ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన రక్షణశాఖ రుణం తీర్చుకునేందుకు, అదే రక్షణశాఖకు రూ.108 లక్షలను కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు అందజేశారు బలరామయ్య. హైదరాబాద్ సైనిక్‌పురిలో ప్రభుత్వమిచ్చిన 350 గజాల స్థలాన్ని అమ్మి రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.54 లక్షల చొప్పున రూ.1.08 కోట్లు విరాళంగా ఇచ్చారు. కోవిడ్‌లో సేవాభారతి కార్యక్రమాలకు బాసటగా రూ.1.08 కోట్లతో ఆరు అంబులెన్సులను రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేశారు. తొలిగా వ్యాపారం ప్రారంభించిన కుగ్రామానికి కల్యాణమండపం, పుట్టిన ఊరిలో గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల భవనం నిర్మించారు.

ఒలింపియన్ కావాలని..

కృష్ణాజిల్లా భట్ల పెనుమర్రు బలరామయ్య సొంతూరు. తండ్రి ఐదెకరాల చిన్న రైతు. అయిదుగురు సంతానం. 5వ తరగతిలో ఫెయిల్యూర్స్ కసితో చదువు, ఆటల్లో ముందుంటూ వచ్చిన బలరామయ్య, తన గ్రామంలో ఒలింపిక్ మెడలిస్ట్ కామినేని ఈశ్వరరావు ఇచ్చిన వెయిట్ లిఫ్టింగ్ ప్రదర్శన చూశాక తానూ ఒలింపియన్ కావాలని ఆశపడ్డాడు. 11వ తరగతిలో పదిమంది బాల్యస్నేహితులు ఫెయిలైతే, తాను మాత్రం ఉత్తీర్ణుడయ్యాడు. ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్లని తెలిసి, జేబులో రూ.5తో 18 ఏళ్లప్పుడు నేరుగా వెళ్లి ఎంపికయ్యాడు. వెయిట్‌లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేస్తూ జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదిగి, ఇండియాకు ప్రాతినిధ్యం వహించారు. మిడిల్ వెయిట్ కేటగిరీలో హెవీ చేసే బలరామయ్య, 1972 ఒలింపిక్స్‌కు అవకాశం లభిస్తుందని భావించారు. రైల్వేస్ నుంచి మంచి ఆఫర్‌తో ఏడాది 1971లో ఎయిర్‌ఫోర్స్ నుంచి బయటకొచ్చేశారు. రెండేళ్లు అపాయింట్‌మెంట్ రాలేదు. మన స్తాపంతో 1973లో తన దగ్గరున్న కొద్దిపాటి డబ్బుతో 1500 కోళ్లతో ఫారం పెట్టారు. పదేళ్లలో దేశంలోనే నెంబర్‌వన్ పౌల్ట్రీ ఫామ్‌గా విస్తరింపజేశారు. విజయవాడ దగ్గర హేచరీస్ నడిపారు. లక్షన్నర కోళ్లతో రోజూ 75 వేల గుడ్ల ఉత్పత్తి. దేశమంతా పంపిణీదారులు. ప్రపంచంలోని అతి పెద్ద పౌల్ట్రీ కంపెనీ హైలైన్ ఇంటర్నేషనల్‌కు ఇండియా పంపిణీదారుగా చేశారు. ఎకరం రూ.వెయ్యి చొప్పున మూడున్నర ఎకరాలతో మొదలుపెట్టి 1998 నాటికి 500 ఎకరాల భూమికి యజమాని అయ్యారు. సామాజిక సేవలో ఇప్పటికి 450 ఎకరాలు ఖర్చుకాగా, హైదరాబాద్, విజయవాడలో పాతికేసి ఎకరాల చొప్పున 50 ఎకరాలు మిగిలాయి.



సీబీఆర్ ప్రసాద్

సైనిక్ స్కూళ్ల ఏర్పాటు

సైనికులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేతనకొండలోని తన భూమిలో రూ.20 కోట్ల విలువైన 8 ఎకరాల స్థలం, 1.20 లక్షల చదరపు అడుగుల భవనాన్ని విద్యాభారతికి డొనేట్ చేశారు. అక్కడ 'నేతాజీ సైనిక్ స్కూలు' జూన్ నుంచి ప్రారంభం కానుంది. ఏపీలో రెండు బాలికల సైనిక్ స్కూళ్లు, తెలంగాణలో బాలుర సైనిక్ స్కూలు ఏర్పాటుకు నిర్ణయించారు. 'ఒక్కో స్కూలుకు భూమి కాకుండానే రూ.10 కోట్లు కావాలి. ఆర్థిక వనరులు ఉన్నాయి నా దగ్గర... మంచి నిర్వహణ టీమ్ లభిస్తే... ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తాను' అని చెప్పారు బలరామయ్య. సమాజానికి ఇవ్వడంలో ఆనందం ఉంది. అలాంటి వ్యక్తులే దేశానికి కావాలి. 'ఇప్పుడు మళ్లీ క్రీడా అకాడమీని పునరుద్ధరించాలనే సంకల్పంతో ఉన్నాను' అని చెప్పారు.

క్రీడలకు పెద్దఎత్తున ప్రోత్సాహం

వ్యాపారంలో సంతృప్తస్థాయికి చేరుకున్నాక ఒలింపిక్ కల గుర్తుకొచ్చింది. తాను వెళ్లలేకున్నా క్రీడాకారులకు సాయపడాలని 1998 నుంచి క్రీడాకారులకు ఆర్థికసాయం చేస్తూ వచ్చారు. నెలకు రూ.10 లక్షల చొప్పున సాయం చేశారు. ఎందరో క్రీడారత్నాలకు ఆర్థికసాయం అందించారు. 2000లో విజయవాడ దగ్గర్లోనీ కేతనకొండలో సీబీఆర్ స్పోర్ట్స్ అకాడమీని స్థాపించారు. స్పోర్ట్స్ హాస్టల్, స్కూల్, జిమ్, సేంద్రియ వ్యవసాయం, ఉపాధి శిక్షణ అన్నీ ప్రవేశపెట్టారు. ప్రత్యేకంగా కోచ్‌లను నియమించి రెండుమూడేళ్లలోనే స్కూల్ గేమ్స్ నుంచి సీనియర్స్ వరకు వందమందికి శిక్షణనిచ్చారు. వీరిలో 30 మంది అంతర్జాతీయ మెడల్స్ కొట్టినట్టు బలరామయ్య గుర్తుచేసుకున్నారు. కరోనా లాక్‌డౌన్ వరకు అకాడమీ నడిచింది. ఆసియా, కామన్‌వెల్త్ గేమ్స్‌లో పతకాలను సాధించారు. 'వరల్డ్ యూనివర్సిటీకి ప్రాతినిధ్యంలేని ఇండియా నుంచి మేం టీమ్‌ను తీసుకెళ్లటం గొప్ప సంతృప్తి' అన్నారు. 'క్రీడాసంఘాల్లో అవినీతి, బంధుప్రీతి, రాజకీయాలతో విసుగెత్తి వదిలేశాను' అని చెప్పారు.

ధర్మోరక్షతి రక్షితహ ట్రస్ట్ భవనం ప్రారంభం



భవనం ప్రారంభించి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తాడికొండ: హైందవ ధర్మ విశిష్టత ప్రపంచానికి చాటి చెప్పడంలో శివస్వామి కృషి ఎనలేనిదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం తుళ్లూరు మండలం తాళ్ళయపాలెంలోని శైవ క్షేత్రంలో ధర్మోరక్షతి రక్షితహ ట్రస్ట్ నూతన భవనం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రస్ట్ నూతన భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నిర్మాణ దాతలు సతీష్ ఉమరాణి దంపతులకు ధన్యవాదాలు తెలియజేశారు. శివస్వామి ఈ ట్రస్ట్‌లో 64 సేవా విభాగాలు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గో సంరక్షణ ద్వారా ఆరు వేల గోవులను రక్షించి వాటి పోషణ చూసుకోవడం అభినందనీయమన్నారు. మానసారా–మన సారె అనే కార్యక్రమం ద్వారా అనేక రాష్ట్రాల్లో అమ్మవారికి కార్యక్రమాలు నిర్వహిస్తూ సాంస్కృతి పట్ల యువతకు అనేక ప్రయోజకర కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. భక్తునిగా శివస్వామికి తాను శిరస్సు వచ్చి పాదాభివందనలు చేస్తున్నారన్నారు. శివస్వామి మాట్లాడుతూ ధర్మోరక్షతి రక్షితహ భవనాన్ని ధార్మిక సేవా భావాలతో 2009 నుంచి నిర్వహిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది వేల మంది ఈట్రస్ట్ కేంద్రంగా పనిచేస్తున్నారన్నారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ వద్ద వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్‌లో గుర్తు తెలియని మృతదేహం చెట్టుకు వేలాడుతూ మెట్లపై పడిపోయి వున్న స్థితిలో స్థానికులు గుర్తించి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి మెడకు ఉరి వేసుకుని వున్న లుంగీ, కండువాను తొలగించి మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. లుంగీ, కండువా కలిపి కట్టుకుని ఉరి వేసుకుని ఉంటాడని ఎస్ఐ శ్రీనివాసరావు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు మాత్రం కృష్ణానది తీరంలోని పుష్కర ఘాట్‌లలో, ఇసుక తిన్నెల్లో అనేక అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయని, చాలా మందిని కొట్టి డబ్బులు, వస్తువులు లాక్కుని పారిపోయిన సంఘటనలు ఉన్నాయని, ఇక్కడ నిద్ర చేయడానికి వచ్చిన వ్యక్తిని ఎవరో కొట్టి చంపి చెట్టుకు వేలాడి తీసి ఉంటారని అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం, చెన్నారెడ్డి కాలనీ ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధుడు శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కొత్త రెడ్డిపాలెంకు చెందిన కారుమూరి ధనంబాబు (60) ఇంట్లోని విద్యుత్ మోటారుకు సంబంధించిన వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మృతుని కుమారుడు అనారోగ్యానికి గురవడంతో వారి కుటుంబ పోషణ, ఆలనా పాలన కూడా ధనంబాబే చూడాల్సిన పరిస్థితి ఉంది. నిరుపేద కుటుంబానికి చెందిన ధనం బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారి కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. జరిగిన సంఘటనపై స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు పరిశీలించి నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

అపార్టుమెంట్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

చనిపోయేటట్లు ప్రేరేపించారని బంధువుల ఆరోపణ



జగదీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్డులో నిర్మాణంలో వున్న ఒక అపార్టుమెంట్ పై నుంచి శనివారం సాయంత్రం ఓ వ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తాడేపల్లి పట్టణ సీఐ కల్యాణ్‌రాజు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి గుంటూరు సప్తపదిలోని విద్యానగర్‌కు చెందిన గండు జగదీష్ (35) గుర్తించారు. ఇతను తన ద్విచక్రవాహనంపై గుంటూరు నుంచి వచ్చి ఐదు అంతస్తుల భవనం పైకి ఎక్కి కిందకు దూకాడని, తలకు తీవ్రమైన గాయం ఏర్పడిందని, కొన ఊపిరితో ఉండడంతో భవనంలో పనిచేస్తున్న పనివారు ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా జగదీష్ మృతి చెందినట్లు సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. జగదీష్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ఇదిలా ఉండగా జగదీష్ బంధువులు మాత్రం గత ఐదు సంవత్సరాల నుంచి జగదీష్‌తో సన్నిహితంగా ఉండే బంధువులు హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ కారణం చేతే ఆత్మహత్య చేసుకున్నాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వారే హత్య చేసిఉంటారేమోననే దిశలో దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. ప్రత్యక్ష సాక్షులు మాత్రం బిల్డింగ్‌పై నుంచి దూకినట్లు తెలిపారు. జగదీష్ తమ్ముడిని వివరాలు అడిగేందుకు ప్రయత్నించగా ఇప్పుడు ఏమీ చెప్పలేనని, మా అన్నయ్యది ముమ్మాటికీ హత్యేనని, పోలీస్‌స్టేషన్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు.

కల్యాణం.. కమనీయం



నగరంపాలెం: స్థానిక కృష్ణానగర్ ఒకటో వీధిలో వేంచేసిన శ్రీగోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సుప్రభాతసేవతో ప్రారంభమై, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీగోదాపద్మావతి వేంకటేశ్వరస్వామిల కల్యాణం వేద మంత్రాల నడుమ వైభవంగా చేపట్టారు. తొలుత విశ్వక్‌సేన పూజ, కంకణ ధారణ, సుముహూర్తం, మంగళసూత్రధారణతో కల్యాణ విశేషాలను భక్తులకు వివరించారు. మహాహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కనకధారా స్తోత్రపారాయణం, కల్యాణ మూర్తులకు లక్ష మల్లెల, తులసి దళార్చన కనుల పండువగా నిర్వహించారు. నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పొగాకు రైతు ఆత్మహత్య

ప్రత్తిపాడు: పొగాకు సాగు చేసిన ఓ రైతు అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పెదనందిపాడు మండలం పుసులూరుకు చెందిన కావూరి శివశంకర వరప్రసాద్ సుమారు ఇరవై సంవత్సరాల కిందట ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు బతుకుదెరువు కోసం వచ్చి వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో ఉన్న ఇంటిని తనఖా పెట్టి ఏడాది కిందట శ్రీరామ్ ఫైనాన్స్‌లో రూ. 3 లక్షల రుణం తీసుకుని క్రమం తప్పకుండా కిస్తీ చెల్లిస్తున్నాడు. ఎప్పటిలానే ఈ ఏడాది కూడా శివశంకర్ ప్రసాద్ పదకొండు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పొగాకు పంట సాగు చేశాడు. పంట సరిగా పండకపోవడంతో అప్పులపాలయ్యాడు. గత నెల 20వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన సోదరుడు కావూరి వెంకట శ్రీనివాసరావు స్థానిక ఆర్‌ఎంపి వైద్యునితో మూడు రోజుల పాటు ఇంట్లోనే చికిత్స చేయించారు. అయినా వాంతులు తగ్గకపోవడంతో 23వ తేదీన ఈదులపాలెంలోని కాటూరి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సోదరుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. నాగేంద్ర తెలిపారు.

ఎస్జీటీల బదిలీలు మాన్యువల్‌గా నిర్వహించాలి

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్
- నేడు ఉమ్మడి గుంటూరు డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపు



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి, మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉమ్మడి గుంటూరు డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఐక్య వేదిక గుంటూరు జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు కె.బసవలింగారావు, ఎం.కళాధర్, డి.పెదబాబు తెలిపారు. ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖ కమిషనర్ తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఉమ్మడి గుంటూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సెలింగ్‌కు విరుద్ధంగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్న విద్యాశాఖాధికారుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా డీఈఓ కార్యాలయాల ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గుంటూరుజిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు ఫోన్ చేసి బలవంతంగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఒత్తిడి చేయడం తగదని, ఆదివారం నిర్వహించనున్న వెబ్ కౌన్సెలింగ్ ట్రయల్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శన అనంతరం డీఈఓ సీవీ రేణుకకు వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు శ్రీనివాస్, సంపత్, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ఎం.హనుమంతరావు, డీకే సుబ్బారెడ్డి, రమేష్, ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో దళితుల అభ్యున్నతి

విగ్రహావిష్కరణ సభలో వివిధ రంగాల ప్రముఖులు



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పీవీ సునీల్‌కుమార్

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తిగా దళితులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత ఉందని కొల్లిపర మండల గ్రామం తూములూరు శివారు క్రిస్టియన్‌పాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. గ్రామంలో ఏర్పాటుచేసిన నిలువెత్తు విగ్రహాన్ని శనివారం రాత్రి సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. సభకు విగ్రహ కమిటీ అధ్యక్షుడు కనపర్తి మోహనరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ, విద్యకు ప్రాముఖ్యత నివ్వాలని సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందనీ, ప్రతిఒక్కరు చదువుకోగలిగినప్పుడు సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే విద్యాసాగర్ తన ప్రసంగంలో దళితులు కుర్చీల్లో కూర్చోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో రాజ్యాధికారం సాధించుకోవాల్సి ఉందన్నారు. అందుకు అంబేడ్కర్ విగ్రహం స్ఫూర్తి కావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. విశ్రాంత వాణిజ్య పన్నుల అధికారి బొనిగల రామారావు మాట్లాడుతూ దళితులు, బలహీనవర్గాల ప్రజలే చరిత్రను నిర్మించినవారని గుర్తుచేశారు. భాషను కనుగొన్నది కూడా వాళ్లేనని చెప్పారు. దళితవాడల నుంచి ఎందరో మేధావులు, విద్యావంతులు వెలుగులోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కులవివక్ష పోరాట కమిటీ నాయకుడు ఉన్నవ వినయ్‌కుమార్ మాట్లాడుతూ వివక్షత నుంచి విముక్తులు కావాల్సి ఉందన్నారు. కనపర్తి బెనహర్ తన ప్రసంగంలో, కొల్లిపర ప్రాంతానికి చెందిన దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం బాటలో దళితుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విగ్రహ కమిటీ కన్వీనర్ తెనాలి మోహనరావు, కనపర్తి అబ్రహాం లింకన్, మన్నవ ప్రభాకర్, అక్కిదాసు కిరణ్, బేతాళ భూషణం, యంద్రపాటి సాంబయ్య, సిద్దెల అబ్రహం, యంద్రపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.